ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
5

శ్రీకాకుళం
జిల్లా వార్తలు
మంగళవారం 4 నవంబరు 2025



హరహర మహాదేవ

● శైవక్షేత్రాలకు పోటెత్తిన భక్తులు ● నదిలో కార్తీక దీపాలు విడిచిపెట్టిన మహిళలు



జలుమూరు: శ్రీముఖలింగేశ్వర స్వామి సన్నిధిలో భక్తుల రద్దీ



అరసవల్లి: నాగావళి నదిలో దీపాలు విడిచి పెడుతున్న మహిళలు

హరహర మహాదేవ.. శంభో శంకర నామస్మరణతో శైవక్షేత్రాలు మార్మోగాయి. కార్తీక రెండో సోమవారం సందర్భంగా శివుడి దర్శనానికి భక్తులు బారులు తీరారు. శ్రీముఖలింగంలోని శ్రీ ముఖలింగేశ్వర, రావివలసలోని ఎండలమల్లికార్జున, శ్రీకాకుళంలోని ఉమారుద్ర కోటేశ్వర తదితర ఆలయాలకు భక్తులు పోటెత్తారు. విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. మహిళలు నాగావళి నదిలో కార్తీక దీపాలు విడిచిపెట్టారు. అరటి దొప్పల్లో దీపాలు వెలిగించడంతో కార్తీక శోభ వెల్లివిరిసింది. - ఆంధ్రజ్యోతి బృందం



టెక్కలి రూరల్: ఎండలమల్లికార్జున స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



అరసవల్లి: శ్రీకాకుళం నగరంలోని ఉమారుద్రకోటేశ్వర ఆలయంలో స్వామివారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

మొంథా నష్టం
రూ.1.24 కోట్లు

● అధికారుల ప్రాథమిక అంచనా ● వరి పంటకు 15 మండలాల్లో ముప్పు



జి.సిగడాం : నాగులవలసలో నీట మునిగిన వరి పంటను చూపిస్తున్న రైతులు (ఫైల్)

శ్రీకాకుళం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో జిల్లాకు తీవ్ర నష్టం వాటిల్లింది. భారీ వర్షాలు, ఈదురుగాలల కారణంగా పలు శాఖలకు సంబంధించి మొత్తంగా రూ.1.24 కోట్లు నష్టం వాటిల్లినట్టు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. అత్యధికంగా ఆర్అండ్‌బీ, విద్యుత్ శాఖకు నష్టం వాటిల్లినట్టు గుర్తించారు. 2,230.29 హెక్టార్లలో వరి పంట ముంపునకు గురైనట్లు అంచనా వేశారు. దీని నష్టం రూపాయల్లో నిర్ధారించాలంటే.. క్షేత్రస్థాయిలో సర్వే చేసి గణించాల్సి ఉంది. ఎకరాకు 33 శాతం పంట నష్టపోతేనే.. పరిహారం అందజేయనున్నారు. జిల్లాలో పదిహేను మండలాల్లోని 53 గ్రామాల్లో వరితోపాటు ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. ఇచ్ఛాపురం మండలం అత్యధికంగా తుఫాన్ ధాటికి గురైంది. ఆ తర్వాత నందిగాం, పాతపట్టణం, టెక్కలి, సోంపేట, లావేరు, జి.సిగడాం, పలాస, మెళియాపుట్టి. (మిగతా 6వ పేజీలో..)

శాఖల వారీ నష్టం

ఆర్అండ్‌బీ	:రూ.90 లక్షలు
పంచాయతీరాజ్	:రూ.15 లక్షలు
ఏపీఈపీడీసీఎల్	:రూ.11.73 లక్షలు
గృహ నిర్మాణ	:రూ.7.06 లక్షలు
పశుసంవర్ధక	:రూ.1.1 లక్షలు
మొత్తం	:రూ.124.89 లక్షలు

అంచనా వేస్తున్నాం

జిల్లాలో మొంథా తుపాను నష్టాన్ని అంచనా వేస్తున్నాం. పంట నష్టాన్ని మండలాల వారీగా వ్యవసాయ రెవెన్యూ సిబ్బంది యాప్‌లో వివరాలు పొందుపరుస్తున్నారు. తుది నివేదికను ప్రభుత్వానికి అందజేస్తాం.

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఆలయాలు భద్రమేనా?

● కానరాని బారికేడ్లు, సీసీ కెమెరాలు
● కొన్నిచోట్ల అనుమతులు లేకుండానే దేవాలయాల నిర్మాణం
● ప్రైవేటు ఆలయాల్లో కరువైన భద్రత
● కాశీబుగ్గ ఘటనతో వెలుగుచూస్తున్న డొల్లతనం
● అధికారులు చర్యలు తీసుకోవాలని భక్తుల విన్నపం



కాశీబుగ్గ వేంకటేశ్వర ఆలయంలో తొక్కిసలాట జరిగిన ప్రదేశం (ఫైల్)

మెళియాపుట్టి/పాతపట్నం/నరసన్నపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గలోని ఓ ప్రైవేట్ ఆలయంలో చోటుచేసుకున్న తొక్కిసలాట ఘటనలో తొమ్మిది మంది భక్తులు మృతి చెందగా, మరికొందరు గాయపడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లాలోని ఆలయాల్లో భద్రత ఎంత? అనే ప్రశ్న సర్వత్రా ఉత్పన్నమవుతోంది. జిల్లాలో అరసవల్లి సూర్యనారాయణ స్వామి, శ్రీముఖలింగంలో శ్రీముఖలింగేశ్వర, రావివలసలో ఎండలమల్లికార్జున, శ్రీకూర్మంలో కూర్మనాథ, పాతపట్నంలో నీలమణిదుర్గ, శ్రీకాకుళంలో ఉమా రుద్రకోటేశ్వర వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాలు ఉన్నాయి. అలాగే, నరసన్నపేట, పలాస, మందస, హిరమండలం, టెక్కలి, సోంపేట, కొత్తూరు ఎచ్చెర్ల, రణస్థలం తదితర మండలాల్లో ప్రైవేటు వ్యక్తుల ఆధ్వర్యంలో కొన్ని దేవాలయాలు ఉన్నాయి. ప్రైవేట్ ఆలయాల్లో భద్రతా లోపాలు అధికంగా కనిపిస్తున్నాయి. చాలా ఆలయాల్లో సీసీ కెమెరాలు, బారికేడ్లు లేవు. తరచూ క్యూలైన్లలో భక్తుల మధ్య తోపులాటలు చోటుచేసుకుంటున్నాయి. చిన్నచిన్న గాయాలతో భక్తులు బయటపడుతున్నారు.

● రావివలసలోని ఎండల మల్లికార్జునస్వామి దర్శనానికి జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వస్తుంటారు. కార్తీక సోమవారాలు, శివరాత్రి వంటి పర్వదినాల్లో అయితే భక్తుల రద్దీ మరింత ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ తాత్కాలిక బారికేడ్‌లు ఏర్పాటు చేయడంతో తొక్కిసలాట వంటి ఘటనలు జరిగితే పరిస్థితి ఏంటని భక్తులు అంటున్నారు.

● పాతపట్నంలోని నీలకంఠేశ్వర స్వామిని కార్తీక మాసంలో అధికసంఖ్యలో భక్తులు దర్శించుకుంటుంటారు. ఈ ఆలయానికి స్థానిక మహేంద్ర తనయ నదిపైగల భద్రతలేని కాజ్‌వే వంతెనపై నుంచే వెళ్లాల్సి ఉంటుంది.

● శ్రీముఖలింగేశ్వరుని దర్శనానికి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. కార్తీక మాసంతోపాటు శివరాత్రి రోజున నదీ స్నానాలు వంటివి జరుగుతుంటాయి. అక్కడ తాత్కాలిక బారికేడ్‌లే ఉన్నాయి. ఆలయ పరిసరాల్లో అపరిశుభ్రత నెలకొంది. ఇక్కడ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉంది. ●పాతపట్నం నీలమణిదుర్గ (మిగతా 6వ పేజీలో..)

దేవదాయశాఖ ఆధ్వర్యంలో 739 ఆలయాలే..

జిల్లాలో సుమారు 13వేల దేవాలయాలు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. వీటిలో కేవలం 739 మాత్రమే దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఉన్నాయి. వీటిలో 108 ఆలయాలకు కార్యనిర్వాహక అధికారులు ఉన్నారు. 12వేలకు పైగా ఆలయాలు గ్రామ కమిటీలు, పురోహితులు, అర్చకుల నిర్వహణలో నడుస్తున్నాయి. మరికొన్ని ఆలయాలకు ఎలాంటి కమిటీలు లేవు. టీటీడీ, ప్రభుత్వాలు ఆర్థికంగా సహాయం చేయడంతో ఇటీవల గ్రామాల్లో పెద్ద పెద్ద ఆలయాలను నిర్మించారు. పూర్వకాలంలో గ్రామాల్లో జమిందారి, సంపన్న కుటుంబాలు వివిధ ఆలయాలను కట్టాయి. ఇలాంటి ఆలయాలు దాదాపు 80 శాతం మేర ఉండగా, వీటి నిర్వహణ బాధ్యతలను వంశపారంపర్య ధర్మకర్తలు చూస్తున్నారు.

తేనేటీగల దాడి..15 మంది భక్తులకు గాయాలు

● ఉర్లాం దేవాలయం వద్ద ఘటన

నరసన్నపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉర్లాంలోని త్రిపురసుందరీశ్వరస్వామి ఆలయం వద్ద సోమవారం ఉదయం తేనేటీగల దాడిలో 15 మంది భక్తులు గాయపడ్డారు. కార్తీక సోమవారం సందర్భంగా వివిధ గ్రామాల నుంచి భక్తులు ఆలయానికి వచ్చారు. ఉదయం 7.15 గంటల సమయంలో ఆలయ సమీపంలోని భారీవృక్షం మీద ఉన్న పక్షులు ఒక్కసారిగా ఎగరడంతో తేనే తొట్టే కదిలింది. దీంతో క్యూలైన్‌లో ఉన్న భక్తులపై తేనేటీగలు దాడి చేయడంతో 15 మంది గాయపడ్డారు. ఆ సమయంలో భక్తులు పరుగులు తీయడంతో ఏమి జరిగిందోనని స్థానికులు ఆందోళన చెందారు. చిన్నచిన్న గాయాలు కావడంతో భక్తులు ఇళ్లకు వెళ్లిపోగా, శేషు అనే వ్యక్తి ఉర్లాం పీహెచ్‌సీలో చికిత్స తీసుకున్నాడు.

నీట్ విద్యార్థులకు ఉచిత కోచింగ్

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నీట్ విద్యార్థులకు ప్రభుత్వం ఉచిత కోచింగ్ ఇస్తున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ యశోదలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ సోషల్, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ హాస్టళ్లలో ఇంటర్ చదివి, నీట్ పరీక్షకు హాజరైనవారు, లాంగ్ టర్మ్ కోచింగ్ కావాలి అనుకునే విద్యార్థులు (2023-24, 2024-25) ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఉచిత భోజన, వసతి సదుపాయాలు ఉంటాయన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లకు, డీసీసీలకు, అంబేడ్కర్ స్టడీ సర్కిల్, విజయవాడను (7569226400)సంప్రదించాలన్నారు. వివరాలకు 9441267323, 9701736862, 8978361642 నెంబర్లను సంప్రదించాలన్నారు.

శ్రీకాకుళం కార్పొరేషన్ ప్రత్యేకాధికారి పాలన గడువు పెంపు

శ్రీకాకుళం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరపాలక సంస్థ ప్రత్యేకాధికారి పాలన గడువును మరో ఆరు నెలలు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. దశాబ్దం నుంచి శ్రీకాకుళం కార్పొరేషన్‌కు ఎన్నికలు లేవు. అప్పటి నుంచి ప్రత్యేకాధికారి పాలనలోనే నడుస్తోంది. ప్రత్యేకాధికారిగా జిల్లా కలెక్టర్ వ్యవహరిస్తున్నారు. గత నెలలో పాలన గడువు పూర్తయింది. దీన్ని 2026 ఏప్రిల్ 10వ తేదీ వరకు పెంచుతూ ఏపీ మునిసిపల్ కార్పొరేషన్ చట్టం ప్రకారం ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ సోమవారం ఉత్తర్వులను జారీచేశారు.

త్వరితగతిన సమస్యలు
పరిష్కరించండి
● జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్
7లో

ఎయిర్‌పోర్టు
నిర్మాణం వద్దు
● రీ సర్వే కోసం వెళ్లిన అధికారులను అడ్డుకున్న అనకాపల్లి గ్రామస్థులు
8లో

బస్సులు నిలుపుదల
చేయాలి
● లక్కుపురం కూడలిలో విద్యార్థుల నిరసన
7లో

క్రీడా స్ఫూర్తిని
ప్రదర్శించండి
● ఎమ్మెల్యే గొండు శంకర్
● రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం
7లో

వైసీపీ పాలనంతా అరాచకమే

● పేదలకు అన్నం పెట్టే అన్నా క్యాంటీన్‌లను మూసేసింది
● కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు



అన్నా క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): 'గత వైసీపీ ప్రభుత్వ పాలనంతా అరాచకమే. పేదలకు ఉపయోగపడే ఎన్నో పథకాలను రద్దు చేసింది. రూ.5కే పేదవాడి ఆకలి తీర్చే అన్నా క్యాంటీన్‌లు కూడా మూసేసి వారి కడుపు కొట్టింది.' అని కేంద్ర విమానాయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర వ్యవసాయశాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా రూ.61లక్షల వ్యయంతో నిర్మించిన అన్నా క్యాంటీన్‌ను సోమవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మారినా పేదలకు ఉపయోగపడే పథకాలు కొనసాగించాలని, కానీ అందుకు భిన్నంగా వైసీపీ వ్యవహరించిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నా క్యాంటీనుల పునఃప్రారంభానికి తొలి సంతకం చేశారన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 207 క్యాంటీన్లు నిర్మించి అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. జనవరిలో మరో 70 ప్రారంభిస్తామన్నారు. నాణ్యమైన, రుచికరమైన భోజనం అందిస్తున్నామని తెలిపారు. టెక్కలి నియోజకవర్గ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు రూ.600కోట్లు మంజూరు చేశామని, రెండేళ్లలో ప్రాజెక్టు పూర్తి చేస్తామన్నారు. తొలుత స్థానిక ఎన్టీఆర్, ఎర్రన్నాయుడు పార్కును సందర్శించారు. పార్కు వద్ద ఉన్న భవిత కేంద్రాన్ని పక్కన ఉన్న పాఠశాలకు తరలించి, దాని స్థానంలో అధునాతన హంగులతో గ్రంథాలయాన్ని నిర్మించాలని కలెక్టర్‌కు వివరించారు. మండల కేంద్రంలో రూ.39లక్షల వ్యయంతో నిర్మించనున్న జిల్లా సహకార బ్యాంకు నూతన భవనానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, ఏఎంసీ ఛైర్మన్ బగాది శేషగిరి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, మాజీ ఎంపీపీ తర్ర రామకృష్ణ, ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్, తహసీల్దార్ అప్పలరాజు, డీసీసీబీ సీఈవో దట్ల సత్యనారాయణ, బీఎం దాసరి వెంకటరమణమూర్తి, టీడీపీ నాయకులు బాడాన రవణమ్మ, పూజారి శైలజ తదితరుల పాల్గొన్నారు.

పార్కు స్థలంలో అక్రమ నిర్మాణాలు

● నోటీసులు జారీచేసినా ఆగట్లే
● అధికారుల అండదండలు ఉన్నట్లు విమర్శలు



పార్కు ప్రతిపాదిత స్థలంలో అక్రమ కట్టడం

నరసన్నపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. చెరువు గర్భాలు, పార్కు స్థలాలతో పాటు డ్రైనేజీ, సాగునీటి కాలువల స్థలాలను కూడా ఆక్రమించి కొందరు భారీ భవనాలు నిర్మిస్తున్నారు. సుడా అనుమతి గానీ పంచాయతీ అధికారుల అనుమతి గానీ తీసుకోవడం లేదు. నరసన్నపేట నడిబొడ్డున గల రాతి కర్ర చెరువులో అక్రమ నిర్మాణాలు ఎక్కువగా జరుగుతున్నాయి. పోస్టుమార్టం గది సమీపంలో కట్టడాలు చకచక సాగుతున్నాయి. ఈ స్థలంలో అక్రమ నిర్మాణాలను తొలగించి పార్కు ఏర్పాటుకు గత ప్రభుత్వ హయాంలో అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ ప్రాంతంలో నీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీ కాలువ కూడా నిర్మించారు. అయితే, పంచాయతీకి పన్ను చెల్లిస్తున్నామని, పూర్వం నుంచి గేదెల పాకలు ఉన్నాయని చెప్పి కొందరు వ్యక్తులు ఈ ప్రాంతంలో గత కొద్ది రోజులుగా నిర్మాణాలు చేపడుతున్నారు. వారి వెనుక అధికారులు ఉన్నారనే విమర్శలు ఉన్నాయి. నేషనల్ గ్రీన్ కోర్టు ఆదేశాల మేరకు ఏడాది కిందట రాతికర్ర చెరువులోని అక్రమ నిర్మాణదారులకు రెవెన్యూ, పంచాయతీ అధికారులు నోటీసులు జారీచేశారు. అయినా ఆక్రమణలు మాత్రం ఆగడం లేదు. మారుతీనగర్ జంక్షన్‌లో ఎటువంటి అనుమతులు లేకుండా, మురికి కాలువను ఆక్రమించి ఓ వ్యక్తి భారీ భవంతిని నిర్మించారు. మారుతీనగర్-1లో ఓ వ్యాపారి వంశధార కాలువ స్థలాన్ని కబ్జా చేసి ఎవరూ వెళ్లకుండా గేటు కూడా ఏర్పాటు చేశాడు. ఆక్రమణదారులకు అధికారులు, అధికార, ప్రతిపక్ష నాయకుల అండదండలు ఉన్నాయనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై తహసీల్దార్ ఆర్.సత్యనారాయణను వివరణ కోరగా.. 'అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వచ్చాయి. పరిశీలించి చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే పనులు నిలుపుదల చేశాం.'అని తెలిపారు.


పాతపట్నం: నీలకంఠేశ్వరుని ఆలయంలో..


నరసన్నపేట: నీలకంఠేశ్వర స్వామి ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు


కంచిలి: పాతాళేశ్వరాలయం వద్ద బారులు తీరిన భక్తులు


పాతపట్నం రూరల్: స్వామివారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

శంభో శంకర

- శివాలయాలకు పోటెత్తిన భక్తులు
- సందడిగా కార్తీక మాసం రెండో సోమవారం

కార్తీక మాసం రెండో సోమవారం జిల్లాలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచే ఆలయాల వద్ద భక్తులు బారులుతీరారు. హరహర మహదేవ శంభో శంకర అంటూ ఆలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. శ్రీకాకుళం, ఆమదాలవలస నరసన్నపేట, టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం, పాతపట్నం, తదితర పట్టణాలతోపాటు గ్రామాల్లోని శైవక్షేత్రాలు భక్తులతో కళకళలాడాయి. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేపట్టారు. వివిధ ఆలయాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

- ఆంధ్రజ్యోతి బృందం


రణస్థలం: కంబాలపేట ఎండల మల్లికార్జున స్వామి దర్శనానికి బారులు తీసిన భక్తులు


అరసవల్లి: నాగావళి నదిలో కార్తీక దీపాలు విడిచిపెడుతున్న దృశ్యం


గార: సతివాడ సోమేశ్వరాలయం వద్ద క్యూలో ఉన్న భక్తులు


జలుమూరు: శ్రీముఖలింగేశ్వరస్వామి సన్నిధిలో భక్తులు.. స్వామివారికి అభిషేకం చేస్తున్న దృశ్యం


ఇచ్ఛాపురం: పాతాళ సిద్ధేశ్వరుని దర్శనానికి వచ్చిన భక్తులు


కంచిలి: పాతాళేశ్వరస్వామికి పూజలు..


అరసవల్లి: బొంపాడవీధి శివాలయం వద్ద బారులు తీరిన భక్తులు

పూజల్లో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

శ్రీకాకుళం రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారం పర్వదినం సందర్భంగా శ్రీకాకుళం నగరం పెద్దపాడులో కొలువై ఉన్న మృత్యుంజయేశ్వర స్వామి ఆలయాన్ని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సోమవారం సందర్శించారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభం స్వాగతం పలిక ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలు, అర్చనలు చేశారు.


స్వామివారికి పూజలు చేస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు


ఇచ్ఛాపురం: పాతాళ సిద్ధేశ్వరస్వామి పరిసరాల్లో వనభోజనాల సందడి



పలాస: ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో..

వైభవంగా కార్తీక దీపోత్సవం

పలాస, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో గల సీతారామాలయం ప్రాంగణంలో కార్తీక సోమవారం సందర్భంగా దీపోత్సవాన్ని నిర్వహించారు. పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలకు చెందిన వందలాది మంది భక్తులు పాల్గొని దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు సంప్రోక్షణ చేపట్టి ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేకంగా వేంకటేశ్వరస్వామి తిరునామాలు, శంకు, చక్రాలను పూలతో అలంకరించి చుట్టూ దీపాలు వెలిగించారు. ఏటా ఇక్కడ కార్తీక దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తుంటారు.


దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు


మందస: కాశీవిశ్వేశ్వరాలయం వద్ద..


పలాసరూరల్ మహాదేవపురంలో స్వయంభూలింగేశ్వరుడికి పూజలు

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

కథే ఈ సినిమాకు హీరో


దేవన్


దేవన్ కథానాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వం వహించిన సినిమా 'కృష్ణలీల'. 'తిరిగొచ్చిన కాలం' అనేది ఉపశీర్షిక. ధన్య బాలకృష్ణన్ హీరోయిన్. జ్యోత్స్న జి నిర్మిస్తున్నారు. ఈ నెల 7న సినిమా విడుదలవుతున్న సందర్భంగా దేవన్ మీడియాతో ముచ్చటించారు. 'ఇదో సూపర్ నేచురల్ లవ్‌స్టోరీ. కొత్తదనంతో నిండిన ఈ కథను నిర్మాతలకు వినిపించగానే ఓకే చేశారు. కృష్ణుడు ఒక ప్రేమ కథలో తన లీలలు ఎలా చూపిస్తారనేది ఆసక్తికరంగా చూపిస్తున్నాం. మనుషులు ఎలాగూ గడిచిపోయిన కాలాన్ని తిరిగి తీసుకురాలేరు. దైవత్వంతో ఆ కాలాన్ని తిరిగి తీసుకురావడమే చిత్ర కథాంశం. కృష్ణతత్వాన్ని అందరికీ మరింత బాగా అర్థమయ్యేలా ఇందులోని సన్నివేశాలు ఉంటాయి. కథే ఈ సినిమాకు హీరో. ప్రేమలోని గొప్పదనాన్ని అందంగా ఆవిష్కరిస్తుందీ చిత్రం. భీమ్స్ సిసిరోలియో సంగీతం సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది. చిత్రం అన్ని వర్గాల వారినీ మెప్పిస్తుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు.

నటుడిగా యాభై ఏళ్లు.. 22న భారీ వేడుక!

విలక్షణ నటుడు డాక్టర్ మోహన్‌బాబు నటుడిగా పరిచయమై ఈ ఏడాదికి యాభై ఏళ్లు. ఆయన హీరోగా నటించిన తొలి చిత్రం 'స్వర్గం నరకం' 1975 నవంబరు 22న విడుదల అయింది. ఈ అసాధారణ ప్రయాణాన్ని గౌరవించుకునే క్రమంలో ఈ నెల 22న 'ఎంబీ 50.. ఏ పెర్ల్ నైట్ ట్రిబ్యూట్' అనే పేరుతో ఓ భారీ వేడుకను మంచు విష్ణు నిర్వహించనున్నారు. 'దిగ్గజ నటుడిని, భారతీయ సినిమాకు ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకొనేలా ఈ ఈవెంట్ ఉంటుందని మంచు విష్ణు చెప్పారు. ఎలాంటి సినిమా నేపథ్యం లేకపోయినా ఒంటరిగా సినీ ప్రయాణం మొదలు పెట్టి, తనకంటూ ఓ సామ్రాజ్యాన్ని ఏర్పరచుకుని విలక్షణ నటుడిగా ఎదిగిన మోహన్‌బాబు ఎదిగిన జర్నీ గురించి అందరికీ మరోసారి వివరించి చెప్పనున్నారు. ఈ వేడుక పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని మంచు విష్ణు చెప్పారు.




ఉత్తమ నటుడిగా మమ్ముట్టి రికార్డ్!



సోమవారం ప్రకటించిన కేరళ ఫిల్మ్ అవార్డ్స్‌లో మలయాళ చిత్రరంగ సూపర్‌స్టార్ మమ్ముట్టి ఏడోసారి ఉత్తమ నటుడిగా ఎన్నికై అరుదైన రికార్డ్ నెలకొల్పారు. నటుడు ప్రకాశ్‌రాజ్ అధ్యక్షతన ఏర్పాటైన ఏడుగురు సభ్యులున్న జ్యూరీ కమిటీ అవార్డులను ఎంపిక చేసింది. త్రిస్సూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో కేరళ మంత్రి షాజీ చెరియన్ అవార్డుల వివరాలు వెల్లడించారు. 'భ్రమయుగం' చిత్రంలో నటించిన మమ్ముట్టి ఉత్తమ నటుడిగా ఎన్నికయ్యారు. ఉత్తమ చిత్రంగా 'మంజుమ్మల్ బాయిస్' ఎన్నికైంది. ఉత్తమ దర్శకుడు అవార్డ్ సహా మొత్తం ఎనిమిది అవార్డులతో ఈ సినిమా సత్తా చాటింది. ఉత్తమ నటుడిగా తను మరోసారి ఎన్నిక కావడంపై మమ్ముట్టి వ్యాఖ్యానిస్తూ 'ఇదో ప్రయాణం.. రకరకాల వ్యక్తులతో కలసి చేసే సుదీర్ఘ ప్రయాణం. ఇక్కడ పోటీ అనే పదానికి తావు లేదు' అని అన్నారు.

రాకెట్‌కు బాహుబలి పేరు - రాజమౌళి హర్షం



భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) ఇటీవలె ఎల్‌వీఎం3-ఎం5 రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిన విషయం తెలిసిందే. ఈ రాకెట్‌కు దాని బరువు, సామర్థ్యానికి తగ్గట్టుగా 'బాహుబలి' అనే పేరు పెట్టడంపై దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి హర్షం వ్యక్తం చేశారు. 'దేశానికి గర్వకారణమైన క్షణం ఇది. మా సినిమా టైటిల్‌తో ఉన్న రాకెట్ ఇంత గొప్ప విజయాన్ని సాధించడం మాకు చాలా ఆనందాన్నిచ్చింది' అని ఇస్రో శాస్త్రవేత్తలను రాజమౌళి అభినందించారు.

సినిమా టిక్కెట్‌ల వివాదంపై సుప్రీం స్టే

మల్టిప్లెక్స్‌లలోని సినిమా టిక్కెట్‌లకు ఆడిట్ చేసే విధంగా రికార్డులను నిర్వహించాలని కర్ణాటక హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఏకరూప టిక్కెట్ విధానాన్ని (రూ.200 + జీఎస్టీ) ప్రశ్నిస్తూ హొంబలె ఫిల్మ్, మల్టిప్లెక్స్‌ల సంఘం హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. దీనిపై హైకోర్టు సింగిల్ జడ్జి మధ్యంతర స్టే ఇచ్చారు. ఈ ఉత్తర్వులకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు డివిజన్ బెంచ్ విచారించింది. సెప్టెంబరు 30న 'ఆడిట్ చేసే విధంగా రికార్డులను నిర్వహించాలి' అని ఆదేశాలు జారీ చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం విచారించింది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం టిక్కెట్ ధరలపై అసంతృప్తిని వ్యక్తం చేసింది. మల్టిప్లెక్స్‌లలో వాటర్ బాటిల్‌కు రూ.100 వసూలు చేస్తున్నారని, ఇప్పటికే థియేటర్లకు వచ్చే వారి సంఖ్య తగ్గుతోందనీ, మరింత సహేతుకంగా ధరలను నిర్ణయించాలని, లేకపోతే హాళ్లు ఖాళీగా మారిపోతాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది. బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

'దసరా', 'దియా' చిత్రాలతో తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకున్న దీక్షిత్ శెట్టి నటించిన తాజా చిత్రం 'ద గర్ల్‌ఫ్రెండ్'. రష్మిక కథానాయికగా రాహుల్ రవీంద్రన్ తెరకెక్కించారు. గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్టైన్‌మెంట్స్ బేనర్లపై ధీరజ్ మొగిలినేని, విద్యా కొప్పినీడి నిర్మించారు. ఈ నెల 7న చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర

మన జీవితాలకు వర్తించేలా ఉంటుంది


దీక్షిత్ శెట్టి

విశేషాలను మీడియాతో ముచ్చటించారు దీక్షిత్ శెట్టి. 'దసరా' సినిమాలో నేను పోషించిన పాత్ర నచ్చి, 'ది గర్ల్‌ఫ్రెండ్'లో నటిస్తారా అని దర్శకుడు రాహుల్ రవీంద్రన్ అడిగారు. ఆయన చెప్పిన స్క్రిప్ట్ నచ్చి వెంటనే అంగీకరించాను. ఇందులో నా పాత్ర పేరు విక్రమ్. నా పాత్ర తీరుతెన్నులు ఎలా ఉంటాయి అనేది చాలా క్లియర్‌గా వివరించేవారు రాహుల్. నా పాత్రకు కొన్ని నెగెటివ్ షేడ్స్ ఉంటాయి. ఇప్పటిదాకా మనం చూసిన ప్రేమకథలన్నీ ఒక తరహాలోనే సాగుతుంటాయి. ప్రేమకథని మరో కోణంలో ఆవిష్కరించే చిత్రమిది. మనందరి జీవితాలకు వర్తించేలా సినిమా ఉంటుంది' అని తెలిపారు.

ఘనంగా ఆలయ శిలా శంకుస్థాపన

సోంపేట రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎర్రముక్కాం గ్రామంలో సుమారు రూ.1.50 కోట్లతో నూత నంగా నిర్మించనున్న నీలకంఠేశ్వర ఆలయానికి సోమవారం శిలా శంకుస్థాపన కార్యక్రమం నిర్వ హించారు. టీటీడీ వేద పండితులు అక్కాజోస్యల రమేష్‌శర్మ ఆధ్వర్యంలో అక్కాజోస్యుల రాజశేఖర్ శర్మ, శ్రీకాంత్ శర్మ, అమూల్య శర్మ పర్యవేణలో 20 మంది దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్మాణానికి గ్రామస్థులు బైపల్లి తాతారావు రూ.లక్ష, బీఎస్ఎఫ్ రిటైర్డ్ ఎస్ఐ అంబటి రాజారావు రూ. లక్ష, దమ్ము రాజు రూ.1.11 లక్షలు, పందిరి ప్రశాంత్ రూ.లక్ష విరాళం ప్రకటించారు. అలాగే దివంగత రిక్క ఢిల్లేశ్వరరావు కుమారులు నాగేశ్వరరావు, హరి, నందీశ్వరరావు ఆలయ నిర్మాణానికి 15 సెంట్ల భూమిని దానంగా ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ, గ్రామ సంఘం, శివభక్తులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

ఇచ్ఛాపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): యువసూర్య చారిటబుల్ ట్రస్ట్ మాసోత్సవాల్లో భాగంగా ట్రస్ట్ సభ్యులు సోమవారం 100 మంది నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. రత్తకన్న, కొండపోలమ్మ కాలనీ, బుడ్డెపుపేట, మండపల్లి గ్రామాల్లోని పేదలకు ఒక్కో కుటుంబానికి బియ్యం బస్తాతో పాటు నిత్యావసర సరకులు అందించారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో 15 సార్లు రక్తదానం చేసిన పాతిర్ల గిరిబాబును సత్కరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్, న్యాయవాది ఎం.రాం బాబు, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ పి.దేవేంద్రరెడ్డి, భానుతేజ, చంద్రశేఖర్, ట్రాన్స్‌కో ఏఈ సుగ్గు హరీష్ పాల్గొన్నారు.

త్వరితగతిన సమస్యలు పరిష్కరించండి

● జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్



అర్జీదారులతో మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): అర్జీదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఆదేశించారు. స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల నమోదు పరిష్కార వేదిక 'మీకోసం' ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 92 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినతులను అధికారులు స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ణీత సమయంలోగా అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయి పింఛన్ ఇచ్చి ఆదుకోండి

● దివ్యాంగుడి తాత, నాన్నమ్మ వినతి



గ్రీవెన్స్‌కి దివ్యాంగుడిని తీసుకువస్తున్న తాత, నాన్నమ్మ

కోటబొమ్మాళి మండలం వాండ్రాడ గ్రామానికి చెందిన ముద్దాడ అరవింద్ దివ్యాంగుడు. ఏ పనీ చేయలేని నిస్సహాయుడు.. కనీసం నిలుచోలేని పరిస్థితి.. తల్లిదండ్రులు బతుకుతెరువుకోసం చెన్నై వెళ్లి దురదృష్టవశాత్తు ప్రమాదంలో మృత్యువాతపడ్డారు. దివ్యాంగుడైన అరవింద్‌ను కూలీ పనులు చేసుకునే తాతయ్య జగన్నాథం, నాన్నమ్మ ఆదిలక్ష్మి పోషిస్తున్నారు. పూర్తిస్థాయి పింఛన్‌ను అందజేసి ఆదుకోవాలని వారు జేసీని వేడుకుని వినతిపత్రం అందించారు.

మా ఊరికి రోడ్డు వేయండి

● కొత్తపేట, సెగిడిపేట గ్రామస్థుల విన్నపం



గ్రీవెన్స్ వద్ద ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

తోటపాలెం నుంచి అంబేడ్కర్ నగర్ వరకు ఉన్న సుమారు 5 కి.మీ. బీటీ రోడ్డు దారుణంగా తయారైంది. రెండు దశాబ్దాలుగా ఆ మార్గంలో ప్రయాణం చేందుకు ఇబ్బందులు పడుతున్నాం. తక్షణం రోడ్డు వేసి ఆదుకోవాలని ఎచ్చెర్ల మండలం ముద్దాడ గ్రామ పంచాయతీ కొత్తపేట, సెగిడిపేట, అంబేడ్కర్‌నగర్ గ్రామస్థులు వేడుకున్నారు. ఈ మేరకు జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌కు వినతిపత్రం అందించారు. 2018లో రోడ్డు వేస్తామని చెప్పి కాంట్రాక్టర్ రోడ్డును తవ్వి వదిలేశారని, అప్పటి నుంచి పరిస్థితి మరింత దారుణంగా తయారైందని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. కనీసం నడిచి వెళ్లేందుకు కూడా అనువుగా లేదని వాపోయారు. స్వయంగా పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

రెల్లికుల కమ్యూనిటీ హాల్‌ను మార్చొద్దు

ఆమదాలవలస, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని 14వ వార్డు ఐజే నాయుడు కాలనీలో ఉన్న రెల్లి కుల కమ్యూనిటీ హాల్‌ను యథావిధిగా కొనసాగించాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు. సోమవారం ఈ హాలును సచివాలయంగా మార్పు చేయాలని మునిసిపల్ అధికారులు ప్రయత్నించడంతో స్థానికులు అభ్యంతరం వక్తం చేశారు. ఇదేవార్డులో మరో కమ్యూనిటీ హాల్ ఉండగా రెల్లి కమ్యూనిటీ హాల్‌నే సచివాలయంగా మార్పు చేయడంతో ఆంతర్యమేమిటన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందించారు.

కౌలు రైతులకు న్యాయం చేయండి

అకాల వర్షాలతో వరి, మొక్కజొన్న, పత్తి పంటలు పాడయ్యాయని, కౌలు రైతులకు న్యాయం చేయాలని జిల్లా రైతు సంఘ నాయకులు కోరారు. గ్రీవెన్స్‌లో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌కు వినతిపత్రం అందించారు. అన్నదాత సుఖీభవ పథకం కింద కౌలు రైతులకు రూ.20 వేలు జమ చేయాలని, పంట నష్ట పరిహారం, బీమా, ఈక్రాప్ నమోదు, పెట్టుబడి సహాయం అందజేసి ఆదుకోవాలని కోరారు.

అక్రమ కట్టడాన్ని తొలగించాలి

ఆమదాలవలస, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధి ఆరో వార్డు నంది గిరిపేట పంట కాలువపై నిర్మించిన అక్రమ కట్టడాన్ని వెంటనే తొలగించాలని నాదనాపురం గ్రామానికి చెందిన పాతిన వెంకటరమణ తదితరులు కోరారు. ఈ మేరకు సోమవారం జేసీకి వినతిపత్రం అందించారు. నాదనాపురం మీదుగా సీపాన చంద్రయ్యపేటలోని చెరువును కలుపుతూ వెళ్లే పిల్ల కాలువపై ఓ వ్యక్తి అక్రమంగా ఇంటిని నిర్మించారని, దీనివల్ల పొలాలకు సాగునీరందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు.

న్యూస్ బాక్స్

మహాసభలను విజయవంతం చేయండి

రణస్థలం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో వచ్చేనెల 31 నుంచి 5 రోజుల పాటు నిర్వహించనున్న సీఐటీయూ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకుడు సీహెచ్ అమ్మన్నాయుడు కోరారు. పైడిభీమవరంలో ఓ పరిశ్రమ వద్ద సోమవారం మహాసభల కరపత్రాలు ఆవిష్కరించారు. కార్పొరేట్లకు మేలు చేసేందుకు, కార్మిక వర్గం హక్కులను హరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకున్నాయన్నారు.

గెలుపే లక్ష్యంగా కృషి చేయాలి

జి.సిగడాం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని ఎచ్చెర్ల నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి విశ్వక్సేన్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో జనసేన నాయకుల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మీసాల రవికుమార్, నాయకులు పొగిరి అప్పల నాయుడు, చిరంజీవి, విక్రం సందీప్ పాల్గొన్నారు.

మాక్ అసెంబ్లీకి వెన్నెల

సోంపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈనెల 26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అమరావతిలో విద్యార్థులతో నిర్వహించనున్న మాక్ అసెంబ్లికి మోడల్ పాఠశాల విద్యార్థిని రెయ్యి వెన్నల ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ చిన్నాజీ వర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను సోమవారం ఎమ్మెల్యే బెందాళం అశోక్ అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ బీన ఈశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ కమిషనర్ విదేశీ పర్యటనకు అనుమతి

శ్రీకాకుళం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ పీవీవీడీ ప్రసాద రావు విదేశీ పర్యటనకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈనెల 25 నుంచి డిసెంబరు 14వ తేదీ వరకు కుటుంబ సమేతంగా ఆయన దుబాయ్ వెళ్లనున్నారు. ప్రభుత్వ అధికారిగా విదేశీ పర్యటనకు అనుమతి తీసుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఇదివరకే మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు కమిషనర్ లేఖ రాశారు. ఇరవై రోజుల సొంత ఖర్చులతో దుబాయ్ వెళ్లేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈమేరకు ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు.

జాగ్రత్తలు పాటించాలి

గార, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మొగదాలవలస, కళింగపట్నం తదితర బీచ్‌ల వద్ద సముద్ర స్నానాలు చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని కళింగపట్నం మెరైన్ సీఐ బి.ప్రసాద రావు సూచించారు. షైపాడు మెరైన్ పోలీస్ ఇన్‌చార్జి డీఐజీ గోపీనాథ్ జట్టి ఆదేశాల మేరకు మండలంలోని బీచ్‌ల వద్ద కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా మెరైన్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. తుఫాన్ అనంతరం బీచ్‌లలో పెద్ద గోతులు ఏర్పడినందున అప్రమత్తంగా ఉండాలన్నారు.

స్థలం ఆక్రమణను అడ్డుకోండి

సోంపేట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎల్లమ్మ అమ్మవారి ఆలయం వెనుక భాగంలో స్థలం ఆక్రమణలకు గురవుతోందని, ఆక్రమణ దారులపై చర్యలు తీసుకోవాలని ఆలయకమిటీ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు సోమవారం 'స్పందన'లో డీటీ మహేష్ కు ఫిర్యాదు చేశారు. వినతిపత్రం అందించిన వారిలో సంగారు గోవింద్, శ్రీనివాస రావు, టి.ప్రసాదరావు, పి.మోహన్, ఎం.జయరాం తదితరులున్నారు.

టీడీపీతోనే కార్యకర్తల సంక్షేమం: ఎంపీ కలిశెట్టి



చెక్‌ను అందజేస్తున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

రణస్థలం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే తొలిసారిగా పార్టీ కార్యకర్తల సంక్షేమానికి ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసిన ఘనత టీడీపీకే దక్కుతుందని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. వేల్పురాయి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు బాలి సింహాచలం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ విషయం ఎంపీ పార్టీ కార్యాలయం దృష్టికి తీసుకువెళ్లగా కార్యకర్తల సంక్షేమ నిధి నుంచి రూ 5 లక్షల మొత్తం మంజూరైంది. ఈ చెక్కును సోమవారం బాధిత కుటుంబానికి ఆయన అందించారు. కార్యక్రమంలో నేతలు లంక శ్యామలరావు, పిన్నింటి భానోజీనాయుడు, బాలి శ్రీను, బాలి రామినాయుడు, బాలి రాము తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి పరిహారం అందజేత



మృతురాలి తండ్రికి చెక్కు అందిస్తున్న విప్ అశోక్

కవిటి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ వేంకటేశ్వర ఆలయం వద్ద జరిగిన ఘటనలో మృతి చెందిన ఒడిశా రాష్ట్రం పాత్రపురం బ్లాక్‌లోని గుడ్డిభద్ర గ్రామానికి చెందిన రంగాల రూప కుటుంబానికి ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఆదివారం రాత్రి పరామర్శించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.15 లక్షల చెక్కును మృతురాలి తండ్రి రంగాల ఢిల్లేసుకు అందించారు. ఒడిశా ఎమ్మెల్యే సతీమణి మీనాద్యాన్ సామంతరాయ్ సమక్షంలో బాధిత కుటుంబానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అండగా ఉంటుందని అశోక్ భరోసా కల్పించారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి దాసరి రాజు, కవిటి తహసీల్దార్ కె.మురళీ మోహన్, ఏఎంసీ చైర్మన్ మణిచంద్రప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

బోటు ప్రమాద బాధితులను ఆదుకుంటా

సోంపేట రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎకువూరు సమీపంలోని సముద్రంలో ప్రమాదానికి గురైన బోటు బాధితులను ఆదుకొనేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం 'సముద్రంలో బోటుబోల్తా' శీర్షికతో వచ్చిన కథనానికి ఆయన స్పందించి సదరు ప్రదేశాన్ని పరిశీలించారు. ఆదివారం రాత్రి ఎక్స్‌కవేటర్ సాయంతో బోటును ఒడ్డుకు చేరినట్టు బాధిత మత్స్యకారులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. నష్టపోయిన మత్స్యకారులకు న్యాయం జరిగేలా మత్స్యశాఖ అధికారులతో మాట్లాడతానన్నారు.

ఆధునిక పద్ధతులతో నాణ్యమైన ఉత్పత్తులు

ఆమదాలవలస, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆధునిక పద్ధతులను పాటించడం ద్వారా నాణ్యమైన ఉత్పత్తులు సాధించాలని హార్టికల్చర్ రీసెర్చ్ సెంటర్ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ రాజశేఖర్ అన్నారు. సోమవారం శ్రీనివాసులచార్యులపేటలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో చైతన్య రైతు సంఘం ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఉద్యాన వన పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంటల ఉత్పత్తి పెంపునకు అనుసరించాల్సిన పద్ధతులపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో సర్పంచ్ గౌరీపతి, ఉద్యాన శాఖాధికారి అయితి, హెచ్ఈవో తిరుపతిరావు, విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ హరిచైతన్య, గ్రామ రైతులు పాల్గొన్నారు.

తుఫాన్ బాధిత కుటుంబాలకు రేషన్ పంపిణీ

ఎచ్చెర్ల, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): బడి వానిపేట గ్రామంలో మొంథా తుఫాన్ బాధిత కుటుంబాలకు రేషన్ సరుకులను సోమవారం డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ అన్నెపు భువనేశ్వరరావు పంపిణీ చేశారు. ఒక్కో మత్స్య కార కుటుంబానికి 50 కిలోల బియ్యం, కందిపప్పు, వంట నూనె, పంచ దార తదితర వస్తువులు అందజేసినట్టు తహసీల్దార్ బి.గోపాల్ తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు బెండు మల్లేశ్వరరావు, నేతలు గాలి వెంకటరెడ్డి, వావిలపల్లి రామకృష్ణ, బోర శ్రీనివాసరావు, బల్లాడ అరుణ, మెండ రాజారావు, పైడి అన్నం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు విద్యార్థుల ఎంపిక

ఇచ్ఛాపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్ఎం సూర్యారావు తెలిపారు. రాష్ట్రస్థాయిలో జరిగిన పోటీల్లో అండర్-17 విభాగంలో ఆశి రేవంత్‌రెడ్డి, తిప్పన జీవన్‌రెడ్డి, అండర్-19 విభాగంలో చాట్ల గిరి బంగారు పతకాలు సాధించి జాతీయ పోటీలకు ఎంపికయ్యారన్నారు. వచ్చే నెలలో కాశ్మీర్, అరుణాచల్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు.

ఆలయాలు భద్రమేనా?

(5వ పేజీ తరువాయి)

ఆలయంలో కూడా సౌకర్యాలు లేక భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. బారికేడ్ల ఏర్పాటు చేసినప్పటికీ అవి అంతంత మాత్రంగానే ఉండడంతో భక్తుల్లో భయాందోళన నెలకొంటుంది.

● దేవదాయశాఖ ఆధ్వర్యంలో 6,267.87 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఆలయాల పర్యవేక్షణకు 95మంది ఈవోలు ఉన్నారు. ఒక్కొక్కరు 20 నుంచి 25 ఆలయాల బాధ్యతలు చూస్తున్నారు. ఆలయాలకు వచ్చే ఆదాయం మాత్రమే పర్యవేక్షించి, మిగిలినవి వదిలేస్తున్నా రనే విమర్శలు ఉన్నాయి.

కానరాని సీసీ కెమెరాలు..

జిల్లాలో ప్రైవేట్ వ్యక్తుల పర్యవేక్షణలో నడుస్తున్న చాలా ఆలయాల్లో సీసీ కెమెరాలు లేవు. దీంతో ఆలయాల్లో ఏర్పాట్లపై పర్యవేక్షణ కొరవడుతోంది. పురాతన దేవాలయాల వద్ద భక్తులకు రక్షణ కూడా ప్రశ్నార్థంగా మారింది. తొక్కిసలాట జరిగిన కాశీబుగ్గ వేంకటేశ్వర ఆలయంలో నాణ్యమైన బారికేడ్‌లు లేవని, భక్తుల భద్రతకు అనుగుణంగా ఆలయ నిర్మాణం జరగలేదనే విమర్శలు ఉన్నాయి. ప్రైవేటు వ్యక్తులు ఆలయాలు నిర్మించాలంటే దేవదాయశాఖ ఇంజనీరింగ్ అధికారుల అనుమతి తీసుకోవాలి. దీనిపై ప్రజల్లో అవగాహన లేకపోవడంతో ఎవరికి నచ్చిన విధంగా వారు గుడులు నిర్మిస్తున్నారు. భక్తుల భద్రతను పట్టించుకోవడం లేదు. దీంతో తొక్కిసలాట వంటి ఘటనలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారు. మందస మండలంలో వాసుదేవ ఆలయాన్ని ప్రైవేటుగా నిర్వహిస్తున్నారు. ఇక్కడ బారికేడ్‌లు లేవని భక్తులు తెలుపుతున్నారు. కోష్ట తీరప్రాంతంలోని శ్రీహరి ఆలయంలో కూడా ఇదే పరిస్థితి ఉంది. కార్తీకమాసంలోనే కాకుండా ఇతర సందర్భాలలోనూ ఆయా ఆలయాలకు పెద్ద ఎత్తున భక్తులు తరలివెళ్తుంటారు. క్యూలైన్లతో పాటు తాగునీరు, ఇతర వసతులు ఉన్నాయా? భక్తులు సురక్షితంగా దైవదర్శనం చేసుకొని బయటకు వచ్చే పరిస్థితి ఉందా? లేదా? అనే విషయాన్ని అధికారులు పరిశీలించాల్సి ఉంది. ఎక్కడైనా లోపాలుంటే వాటిని సరిదిద్ది భక్తుల రక్షణకు తొలి ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంది. దేవదాయశాఖ పనితీరు అంతంతమాత్రంగానే ఉంది. దురదృష్టకర సంఘటనలు జరగకముందే సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

రేపు కార్తీక దీపోత్సవం

ఇచ్ఛాపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీక శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని గ్రామ దేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో సామూహిక కార్తీక దీపోత్సవం బుధవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సాయంత్రం 5 గంటల నుంచి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, భక్తులు పాల్గొనాలని కోరారు. ఒక్కో దీపానికి రూ.10 చెల్లించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించండి

● ఎమ్మెల్యే గొండు శంకర్

● రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులంతా క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి రాణించాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక కోడిరామ్మూర్తి స్టేడియంలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను సోమవారం ఆయన క్రీడా జ్యోతిని వెలిగించి బ్యాటింగ్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. టోర్నమెంట్‌లో మంచి ప్రతిభను కనబరిచి జాతీయ, అంతర్జాతీయస్థాయికి ఎదిగాలని కోరారు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో స్టేడియం పనులు నిలిచిపోయాయని, వీలైనంత వేగంగా పూర్తిచేసి క్రీడా కారులకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ.. ప్రభుత్వ పరంగా క్రీడల నిర్వహణకు అవసరమైన ప్రోత్సాహాన్ని ఇచ్చేందుకు కృషి చేస్తామన్నారు. క్రీడాకారులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీవీఈవో విజయ్ కుమార్, జిల్లా ఒలింపిక్ సంఘం సలహాదారు పి.సుందరరావు, కార్యదర్శి ఎం. సాంబమూర్తి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు బీవీ రమణ, స్వాతి, పీఈటీల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.తవిటయ్య, ఎంవీ రమణ, కోశాధి కారి కె.మాధవరావు, గ్రిగ్స్ కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బస్సులు నిలుపుదల చేయాలి

● లక్కుపురం కూడలిలో విద్యార్థుల నిరసన



నిరసన తెలుపుతున్న విద్యార్థులు

సరుబుజ్జిలి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): బూర్జ మండలం లక్కుపురం కూడలిలో బస్సులు ఆపడం లేదని, దీంతో ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం కూడలిలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ కూడలి సమీపంలోని 10 గ్రామాల నుంచి నిత్యం కళాశాలలు, పాఠశాలలకు విద్యార్థులు పాలకొండ, శ్రీకాకుళం, ఆమదాలవలస తదితర ప్రాం తాలకు వెళుతుంటారని, అయితే రిక్వెస్టు స్టాప్ ఉన్నా ఫలితం కనిపించడం లేదన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ కె.దీప విద్యార్థులతో మాట్లాడారు. ఇదివరకు అనేక పర్యాయాలు ఆర్టీసీ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తంచేశారు. సమస్యను ఎమ్మెల్యే కూన రవి కుమార్ దృష్టికి తీసుకొని వెళతామన్నారు. విద్యార్థుల ఆందోళనతో ప్రధానమార్గంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. వెంటనే ఎస్ఐ ప్రవల్లిక సిబ్బందితో చేరుకొని సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పడంతో విద్యార్థినీ విద్యార్థులు శాంతించారు.

అర్జీల పరిష్కారానికి చర్యలు

● ఎస్పీ మహేశ్వరరెడ్డి



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

శ్రీకాకుళం క్రైం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే సమస్యలకు ప్రాధాన్యం ఇచ్చి వాటిని సత్వరం పరిష్కరించే చర్యలు తీసుకోవాలని ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన 52 అర్జీలను స్వీకరించారు. ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను విచారించి పరిష్కరించాలన్నారు. పౌర సంబంధాలు, కుటుంబ వివాదాలు, ఆస్తి తగాదాలు, మోసపూరిత కేసులపై ఫిర్యాదులను స్వీకరించారు.

కార్గిల్ పార్కు పనులు వేగవంతం చేయాలి

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



కార్గిల్ పార్కును పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న కార్గిల్ పార్కు పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కార్పొరేషన్, సుడా అధికారులతో కలిసి పార్కును సందర్శించారు. మట్టిని వేసి సరిచేయాలని, ఆ సమయంలో పిల్లల ఆట వస్తువులను తొలగించాలన్నారు. పచ్చదనం కోసం సత్వర చర్యలు చేపట్టాలన్నారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సందర్శిస్తానన్నారు. కార్యక్రమంలో కమిషనర్ పీవీవీడీ ప్రసాదరావు, సుడా ఈఈ సుగుణాకరరావు, కార్పొరేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యత శిబిరానికి బీఆర్ఏయూ విద్యార్థులు



హర్యానా వెళుతున్న విద్యార్థులతో వీసీ, రిజిస్ట్రార్ తదితరులు

ఎచ్చెర్ల, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): హర్యానా రాష్ట్రం రోహతక్ పట్టణంలోని మహర్షి దయానంద్ యూనివర్సిటీలో నిర్వహించనున్న జాతీయ సమైక్యతా శిబిరానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ విద్యార్థులు సోమవారం పయనమయ్యారు. మంగళవారం నుంచి 7 రోజుల పాటు నిర్వహించనున్న ఈ శిబిరంలో వివిధ రాష్ట్రాల సంస్కృతి, కళలు, క్రీడలు, అభిరుచులు తదితర అంశాలపై పరస్పర భాగస్వామ్యం చేయనున్నారు. వర్సిటీలోని కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విద్యార్థులు ఎస్.త్రివేణి, కె.పవన్, జి.రవి, జి.శ్రావణి, ఎస్.సాయి ప్రదీప్, ఎస్. భార్గవి (ఈసీఈ), జి.చంద్రశేఖర్, పి.అభిషేక్ (ఈఈఈ), ఎస్.అంకిత (కంప్యూటర్స్), ఎం.పవిత్ర (ఎస్‌బీఎస్‌వైఎం డిగ్రీ కళాశాల) ఈ శిబిరంలో పాల్గొంటున్నారు. ఈ బృందానికి వర్సిటీ ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ కె.కరుణానిధి నాయకత్వం వహిస్తున్నారు. జాతీయ సమైక్యతా శిబిరంలో పాల్గొనేందుకు బయలు దేరిన విద్యార్థులను వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ డి.వనజ అభినందించారు.

రైతులకు ప్రయోజనం చేకూర్చేందుకు కృషి

కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు


పీఏసీఎస్ చైర్మన్, సభ్యులను అభినందిస్తున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతులకు ప్రయోజనం చేకూరేలా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు కృషి చేయాలని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడులు అన్నారు. సోమవారం స్థానిక పీఏసీఎస్ చైర్మన్ వెలమల విజయలక్ష్మి, సభ్యులు సాసుమంతు ఆనందరావు, సకాలభక్తుల రాంకుమార్‌ల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, టీడీపీ నాయకులు బోయిన రమేష్, గోవిందరాజులు, వెలమల కామేశ్వరరావు, కర్రి అప్పారావు, పూజారి శైలజ, తర్ర రామకిష్ట తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అధికారులు పని చేయాలని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ వినతులు అందజేశారు. వినతిపత్రాలను మంత్రి స్వయంగా పరిశీలించి గ్రీవెన్స్‌కు హాజరైన అధికారులకు అందజేశారు. వెంటనే సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కల్లి నాగయ్యరెడ్డి, రోణంకి లీలామోహన్ తదితరులు పాల్గొన్నారు.

వలసలు లేని జిల్లాగా తీర్చిదిద్దుతాం

మెళియాపుట్టి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): వలసలు లేని జిల్లాగా శ్రీకాకుళాన్ని తీర్చిదిద్దడానికి అహర్నిశలూ కృషి చేస్తామని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. సోమవారం పెద్దమడిలోని ఏకలవ్య, చాపర కేజీబీవీలలో రూ.10.60 కోట్ల వ్యయంతో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన జిల్లాలో అధికంగా పరిశ్రమలు ఏర్పాటు చేసి.. ఇతర జిల్లాల వారికి ఇక్కడ పని కల్పించే విధంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. పాతపట్నం నియోజకవర్గం తమకు తల్లిలాంటిదని... అందువల్ల ఎటువంటి పథకాలు వచ్చినా ప్రాధాన్యమిస్తున్నామని వివరించారు. జిల్లాకు ఎయిర్‌పోర్టు తీసుకురావాలని ప్రయత్నాలు చేస్తుంటే కొంతమంది అడ్డుకోవడం విడ్డూరంగా ఉందన్నారు.


శిలాఫలకాన్ని ఆవిష్కరించిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు

మెళియాపుట్టిలో ఐటీడీఏ

రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ మెళియాపుట్టిలోనే ఐటీడీఏ ఏర్పాటుకు చర్యలు చేపడతామని తెలిపారు. ఈ నెలలోనే అన్నదాతా సుఖీభవలో రెండో విడత నిధులు రైతుల ఖాతాలలో జమ చేస్తామని ప్రకటించారు. నియోజకవర్గానికి రూ.270కోట్లతో తాగునీరు ఇవ్వడానికి చర్యలు చేపడతామని చెప్పారు. మెళియాపుట్టి మండలంలో ఆరు నెలల్లో ఇంటింటికీ తాగునీరు ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, కలెక్టర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్, ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, ఐడీడీఏ పీవో పవార్‌స్వప్నిల్ జగన్నాథ్, నాయకులు సలాన మోహనరావు, నంబాళ్ల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రెండు వేర్వేరు కేసుల్లో జైలు శిక్ష

పలాస, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు వేరువేరు కేసుల్లో కోర్టు సోమవారం ముద్దాయిలకు జైలుశిక్ష, జరిమానా విధించినట్టు కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ తెలిపారు. 2022లో పాత జాతీయ రహదారి వాసవి టిఫిన్ సెంటరు వద్ద హెడ్‌కానిస్టేబుల్ బి.శ్రీనివాసరావు కు విధులకు ఆటంకం కలిగించడంతో పాటు దాడి చేసిన సంఘటనలో బోసి రాంబాబు అనే వ్యక్తికి మూడు నెలలు జైలు శిక్ష విధిస్తూ పలాస జూనియర్ సివిల్ న్యాయాధికారి యు.మాధురి తీర్పు చెప్పారు. అదేవిధంగా సూదికొండ కాలనీకి చెందిన దాసరి దానయ్య, రాజారావు, పిట్ట షణ్ముఖరావులు పురుషోత్తపురం కాలనీకి చెందిన బండారు శ్రీనుపై దాడి చేసి గాయపరిచినట్లు 2020లో అప్పటి ఎస్ఐ వై.మధుసూధనరావు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ముద్దాయిలు ఒకొక్కరికి రూ.1500 చొప్పున జరిమానా, లేదా మూడు నెలల జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. రెండు కేసుల్లోనూ బాధితుల తరపున ఏపీపీ పి.రమేష్ వాదనలు వినిపించారు.

గ్యాస్ లీకేజీతో కలకలం


సిలిండర్‌ను బయటకు తీసుకు వస్తున్న దృశ్యం

కాశీబుగ్గ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ మారుతీ నగర్‌లో సోమవారం గ్యాస్ లీకైన ఘటన కలకలం రేపింది. ఓ ఇంట్లో గ్యాస్ సిలిండర్‌కు రెగ్యులేటర్‌ను సరిగ్గా అమర్చకపోవడంతో గ్యాస్ లీకైంది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేరు. కానీ గ్యాస్ వాసన రావడంతో చుట్టుపక్కల ప్రాంతాల వారు అప్రమత్తమయ్యారు. ఇంటి యజమానితో పాటు అగ్నిమాపక శాఖ కార్యాలయానికి సమాచారం అందించారు. అగ్నిమాపక శాఖ అధికారి సోమేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. ముందుగా తలుపులు తెరిచి గ్యాస్ బయటకు పోయేలా చేశారు. అనంతరం సిలిండర్‌ను బయటకు తెచ్చి గ్యాస్ లీకు కాకుండా నియంత్రించారు. దీంతో ప్రమాదం తప్పింది. గ్యాస్ వినియోగం విషయంలో అప్రమత్తంగా ఉండాలని అధికారి సోమేశ్వరరావు సూచించారు.

మురుగునీటిలో మృతశిశువు

శ్రీకాకుళం క్రైం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అప్పుడే పుట్టి.. కళ్లు కూడా తెరవని ఆడ శిశువు మురికి కాలువలో విగతజీవిగా కనిపించడం శ్రీకాకుళంలో కలకలం రేపింది. స్థానికులు, శ్రీకాకుళం వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అరసవల్లి ఆదిత్యాలయం ఇంద్రపుష్కరణి వెనుక రహదారికి ఆనుకుని మురికి బందలో సోమవారం రోజులు కూడా నిండని మృత ఆడశిశువు స్థానికులకు కనిపించింది. దీంతో వారు శ్రీకాకుళం వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. వన్‌టౌన్ ఎస్ఐ హరికృష్ణ ఘటన స్థలానికి చేరుకుని మృతశిశువును బయటకు తీయించి రిమ్స్‌కు తరలించారు. శరీరంపై గాయాలు ఉండడంతో కుక్కలు వంటి జంతువులు దాడి చేసి ఉంటాయని పోలీసులు భావిస్తున్నారు. ఈ శిశువును ఎవరు పడేసి ఉంటారో అనే విషయమై అరసవల్లి, ఆదిత్యానగర్ పరిసరాల్లో సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా వివరాలు సేకరించే పనిలో పోలీసులు ఉన్నారు. వన్‌టౌన్ ఎస్ఐ హరికృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మా భూముల్లో రీసర్వే వద్దు


తహసీల్దార్‌తో వాదిస్తున్న గ్రామస్థులు

వజ్రపుకొత్తూరు, నవం బరు 3(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి గ్రామానికి రీ సర్వే కోసం వెళ్లిన అధికారుల బృందాన్ని స్థానికులు అడ్డుకున్నారు. 'మా భూములలో రీ సర్వే చేయవద్ద'ంటూ వాదనకు దిగారు. సోమవారం తహసీల్దార్ సీతారామయ్య, ఆర్ఐ మనోహర్, మండల సర్వేయర్ తిరుపతిరావు, వీఆర్‌ఓలు కలసి మెట్టూరు, చీపురుపల్లి, గుణుపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న భూముల్లో రీసర్వే చేసేందుకు వెళ్లారు. ఆ భూముల పరిధిలోనే ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ప్రతిపాదనలు జరుగుతున్నాయని... అందువల్ల రీ సర్వే చేయడానికి అనుమతించేది లేదని అనకాపల్లి గ్రామస్థులు అధికారులను అడ్డుకున్నారు. తప్పులు సరి దిద్దేందుకు రీ సర్వే చేస్తున్నామని అధికారులు నచ్చజెప్పినా స్థానికులు వినలేదు. తప్పుగా నమోదైన నెంబర్లు సరి చేస్తామని అధికారులు ఎంతచెప్పినా వారు వినకపోవడంతో అధికారులు వెనుదిరిగారు.

ఎయిర్‌పోర్టు నిర్మాణం వద్దు


ఆర్డీవో వాహనాన్ని అడ్డుకున్న మహిళలు

హరిపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మందస మండలం బిడిమి, రాంపురం గ్రామాల్లో కార్గో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు సంబంధించి భూ పరిశీలనకు, సర్వే కోసం వచ్చిన రెవెన్యూ సిబ్బందిని స్థానిక ప్రజలు సోమవారం అడ్డుకున్నారు. మండల సర్వేయర్ బాబూరావు, ఆర్.ఇందిరతో పాటు రెవెన్యూ సిబ్బంది రెండు బృందాలుగా సర్వే పనులు ప్రారంభించగా... 'మా భూముల్లో అనుమతి లేకుండా ఎలాంటి సర్వేలు చేపట్టవద్ద'ంటూ అడ్డుకున్నారు. అదే సమయంలో వచ్చిన పలాస ఆర్డీవో వెంకటేష్, మందస తహసీల్దార్ ఎం.శ్రీకాంత్‌తో అక్కడికి చేరుకోగా.. వారి కారును రైతులు, మహిళలు అడ్డుకున్నారు. ఆర్డీవో వాగ్వాదానికి దిగారు. రైతులు నిరసన తెలియజేయటంతో వారంతా వెనుదిరిగారు. అనంతరం భేతాళ పురం గ్రామం వద్ద ఆర్డీవోకు రైతులు నిరసన తెలియజేశారు. కార్గో ఎయిర్‌పోర్టు వ్యతిరేక కమిటీ అధ్యక్షులు కొమర వాసు, జుత్తు ధర్మారావు, వివిధ గ్రామాల మహిళలు పాల్గొన్నారు.

త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం

నందిగాం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): తెంబూరు పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ పాలక వర్గ ప్రమాణ స్వీకారం సోమవారం జరిగింది. లట్టిగాంలోని పీఏసీఎస్ కార్యాలయంలో చైర్‌పర్సన్‌గా పోలాకి చంద్రశేఖర్, సభ్యులుగా బెండి జగదీష్ చంద్రగిరి, మద్దిలి అనంతయ్యలు ప్రమాణ స్వీకారం చేశారు. సహకార బ్యాంక్ మేనేజర్ చంద్రశేఖరరావు, సూపర్‌వైజర్ ఫాల్గుణరావుల సమక్షంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ చంద్రశేఖర్ మాట్లాడుతూ పీఏసీఎస్ ద్వారా రైతులకు మేలు చేకూర్చి తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో దాసు, సిబ్బంది అప్పన్న, రవికుమార్, నాయకులు వదన్‌గౌడ్, నానీరెడ్డి, క్రిష్టారావు తదితరులు ఉన్నారు.

హామీ పత్రాలు ఇచ్చారు.. స్థలాలు మరిచారు


సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఏవోకు వినతిపత్రం ఇస్తున్న మహిళలు

టెక్కలి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): చింతలగార రెవెన్యూ పరిధిలో ఇళ్లు లేని నిరుపేదలు 600మందిని గుర్తించి జగన్‌మోహన్‌రెడ్డి బొమ్మతో హామీపత్రం ఇచ్చి చివరికి కోర్టు వివాదంతో ఆగిపోయిందని...ఇళ్ల స్థలాలు ఇవ్వలేదని సోమవారం పలువురు మహిళలు సబ్‌కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి అర్జీలను అందజేశారు. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అర్హులైన వారు ఇళ్ల పట్టాలకు దరఖాస్తులు చేసుకోవాలని కోరుతున్నారని... తాము దరఖాస్తు చేసుకునేందుకు ఆధార్ నెంబరు పెడుతుంటే.. ఇళ్ల పట్టాలు మంజూరైనట్లు చూపిస్తున్నాయని సచివాలయ సిబ్బంది చెబుతున్నారని తెలిపారు. తమకు న్యాయం చేయాలని పలువురు మహిళలు కోరారు. గత ప్రభుత్వం హామీ ఇచ్చి నిలువునా మోసం చేసిందని, కూటమి ప్రభుత్వమైనా తమ సమస్యను పరిష్కరించాలని సీఐటియూ నాయకులు హనుమంతు ఈశ్వరరావు, కొల్లి ఎల్లయ్య, తెంబ సరస్వతి, పి.లత, దుర్గాభవాని, కల్యాణి తదితరులు సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేశారు.

దురదృష్టకరమైన ఘటనతో రాజకీయమా?


మాట్లాడుతున్న వజ్జ బాబూరావు

పలాస, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో దురదృష్టవశాత్తూ తొక్కిసలాట జరిగి తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోతే రాష్ట్ర ప్రభుత్వం తక్షణం సహాయక చర్యలు చేపట్టిందని, 24 గంటల్లోనే నష్టపరిహారం ఇచ్చిందని ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు అన్నారు. వారికి అన్ని విధాలా సహాయకారిగా నిలిస్తే దీన్ని వైసీపీ నాయకులు రాజకీయం చేయడం సిగ్గుచేటని అన్నారు. సోమవారం మధ్యాహ్నం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ నాయకులు తమ ఉనికిని చాటుకోవడానికి శవరాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రమాదం జరిగిన నుంచి ఇప్పటి వరకూ మంత్రులు నారా లోకేష్, కింజరాపు అచ్చెన్నాయుడు, ఆనం రామనారాయణరెడ్డి, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు గౌతు శిరీష, బెందాళం అశోక్‌తో పాటు పోలీసు యంత్రాంగమంతా సాయం చేశారన్నారు. ఇకనైనా వైసీపీ నాయకులు శవ రాజకీయాలు మానాలని, లేకుంటే ప్రజల్లో ఉనికి లేకుండాపోతారని హెచ్చరించారు.

దూడల ఉత్పత్తి పథకాన్ని వినియోగించుకోండి


మందులను పంపిణీ చేస్తున్న రాధాకుమారి

ఎల్.ఎన్.పేట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పాడి రైతులు దూడల ఉత్పత్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుగణాభివృద్ధి అసిస్టెంట్ సర్జన్ వైద్యాధికారి పి.రాధాకుమారి సూచించారు. దబ్బపాడు గ్రామంలో సోమవారం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పశుసంపద అభివృద్ధి చెందాలంటే పాడిరైతులు ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను వినియోగించుకోవాలని చెప్పారు. అనంతరం గ్రామంలోని పాడిపశువులకు వైద్యపరీక్షలు నిర్వహించి.. అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ఆమెతోపాటు మండల పశువైద్యాధికారి జి.కవిత, ఎహెచ్‌ఎలు, గోపాలమిత్ర సిబ్బంది, పాడిరైతులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం


విద్యార్థులతో నిర్వాహకులు, అధ్యాపకులు

పలాస, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో విజిలెన్స్ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సోమవారం బహుమతి ప్రదానం చేశారు. పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ డీజీఎం ఎస్.నటరాజ్ విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ లక్ష్యాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ కె.ఎస్.వెట్టి, అధ్యాపకులు కొండల మధుబాబు, బి.ప్రసాదరావు, ఎస్.యుగంధర్, టి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి గణిత పోటీలకు ఎంపిక

పోలాకి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సిక్కోలు జిల్లా గణిత ఉపాధ్యాయ వేదిక మండల స్థాయిలో పోలాకి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన గణిత పార్యాంశ ప్రతిభా పరీక్షల్లో మండలానికి చెందిన వివిధ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. వీరు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనటు గణిత ఉపాధ్యాయ వేదిన సభ్యులు సోమవారం విలేకరులకు తెలిపారు. వీరు త్వరలో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు.

ఆలయాల వద్ద పోలీసు బందోబస్తు


ఉమారుద్రకోటేశ్వర స్వామి ఆలయం వద్ద విధుల్లో ఉన్న పోలీసులు

హిరమండలం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం రెండో సోమవారం సందర్భంగా మండలంలోని వివిధ శివాలయాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఇటీవల కాశీబుగ్గలోని వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద జరిగిన తొక్కిసలాట నేపథ్యంలో ముందు జాగ్రత్తగా శివాలయాల వద్ద పోలీసు బందోబస్తు నిర్వహించామని ఎస్ఐ వెంకటేష్ చెప్పారు.

పాఠశాలకు భవనాలు మంజూరు చేయండి


ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికి వినతిపత్రం అందజేస్తున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు

నరసన్నపేట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక వంశధార నగర్ కాలనీలో గల ప్రాథమిక పాఠశాల భవనాలు శిథిలమయ్యాయని... కొత్తభవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం ప్రజాసదన్ వద్ద ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికి వినతిపత్రం అందజేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు భవనం తడిచి నీరు కారుతోందని తెలిపారు. దీని వల్ల అంగన్‌వాడీ కేంద్రంలో తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. వెంటనే కొత్తభవనాలు నిర్మించాలని తల్లిదండ్రులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే బగ్గురమణమూర్తి స్పందించి అంచనాలు సిద్ధం చేసి నివేదిక ఇవ్వాలని సమగ్ర శిక్షాభియాన్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎం.రజని, సుగుణ, ఉమా మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సాయాన్ని వినియోగించుకోండి

పోలాకి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా వేటకు వెళ్లలేక.. ఉపాధి కోల్పోయిన మత్స్యకార కుటుంబాలకు కూటమి ప్రభుత్వం ఉచితంగా నిత్యావసర సరకులు పంపిణీ చేస్తోందని.. వాటిని వినియోగించుకోవాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. సోమవారం ఆయన రాజారాంపురం, గుల్లవానిపేట, కొత్తరేవు, గుప్పెడుపేట గ్రామాల్లోని మత్స్యకారులకు ప్రభుత్వం సరఫరా చేసిన నిత్యావసర సరకులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం నుంచి మత్స్యకారులకు పథకాల అమలులో ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి వెంకటమధు, బగ్గు అర్చన, బైరి భాస్కరరావు, ఎం.వి.నాయుడు, షైలపల్లి త్రినాథ్, ఎర్రయ్య, అర్జాల విష్ణు, తహసీల్దార్ పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాలపై ఆందోళన వద్దు: కమిషనర్


వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ రామారావు

పలాస, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): టిడ్కో గృహాలపై ప్రజలు ఆందోళన చెందవద్దని, వీటిని తొందరలోనే కేటాయిస్తామని మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు తెలిపారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. అనేక మంది బాధితులు టిడ్కో గృహాలపై వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గృహాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. మొత్తం పనులన్నీ పూర్తిచేసిన వెంటనే అప్పగిస్తామని వివరించారు. వితంతు పింఛన్లు, స్థలాల ఆక్రమణలు నివారించాలని, బర్త్, డెత్ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని కోరుతూ అనేక మంది వినతులు అందజేశారు.

పరిసరాల పరిశుభ్రతపై శ్రద్ధ చూపండి: పీవో


విద్యార్థులతో మాట్లాడుతున్న పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్

పాతపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతపై శ్రద్ధ చూపాలని ఐటీడీఏ పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్ అధికారులను ఆదేశించారు. స్థానిక గిరిజన బాలుర పోస్టుమెట్రిక్ వసతిగృహాన్ని సోమవారం సాయంత్రం ఆకస్మికంగా ఆయన సందర్శించారు. వసతిగృహ పరిసరాలను, వంటగదిని, విద్యార్థుల గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ మెనూ అమలు, బోధన తీరుపై ఆరా తీశారు. అంటువ్యాధులు ప్రబలకుండా వసతిగృహాల పరిసరాల పరిశుభ్రతపై శ్రద్ధ చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయనతో వివిధ శాఖల సిబ్బంది ఉన్నారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

పాతపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ పాతపట్నంలోని ప్రధాన వీధులకు మంగళవారం రక్షిత మంచినీటి పథకం ద్వారా తాగునీటి సరఫరా చేయలేకపోతున్నామని ఈవో ఊన రామచంద్రరావు తెలిపారు. ప్రధాన పైప్‌లైను కు మరమ్మతుల కారణంగా తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతోందని...ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

రేపు డయల్ యువర్ డీఎం

టెక్కలి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): టెక్కలి ఆర్టీసీ డిపో నుంచి దూర ప్రాంత సర్వీసులైన విజయవాడ, రాజమండ్రి, అమలాపురం, కాకినాడ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులు తమ సందేహాలు, సలహాలు, సూచనలు, అభ్యర్థనలు తెలిపేందుకు బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ ఎన్.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రయాణికులు 99592 25611 నెంబరుకు వివరాలు తెలియజేయాలని ఆయన సూచించారు.

'మొంథా' నష్టం రూ.1.24 కోట్లు

(5వ పేజీ తరువాయి)

వజ్రపుకొత్తూరు, మందస, నరసన్నపేట, కొత్తూరు మండలాల్లో పంటలు పాడయ్యాయి. ఈ ప్రాంతాల్లో ఇటు రోడ్లు.. ఇళ్లకు కూడా నష్టం వాటిల్లింది. శుక్రవారం రాత్రి వరకు 302 హెక్టార్ల మేర అధికారులు సర్వే చేశారు. పంట నష్టాన్ని ప్రభుత్వం తాజాగా రూపొందించిన ఏపీఏఐఎంఎస్ యాప్ 2.0లో వివరాలు పొందుపరిచారు. పూర్తిస్థాయిలో పంట నష్టాన్ని గుర్తించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తే. త్వరలో పరిహారం అందజేయనుంది.

నష్టాలు ఇవీ ...

ముంపునకు గురై పాడైన వరి పంట	: 2,230.29 హెక్టార్లు
పాడైన ఉద్యాన పంటలు	: 2.79 హెక్టార్లు
ప్రభావితమైన రైతుల సంఖ్య	: 4,801 మంది
పూర్తిగా కూలిన పక్కా ఇళ్లు	: 1
పూర్తిగా కూలిన కచ్చా ఇళ్లు	: 6
పాక్షికంగా పాడైన పక్కా ఇళ్లు	: 2
పాక్షికంగా పాడైన కచ్చా ఇళ్లు	: 32
పాడైన గుడిసెలు	: 3
పాడి పశువు మృతి	: 1
చిన్న పశువులు	: 8
గర్భిణులను ముందస్తుగా తరలింపు	: 57 మంది
పునరావాస కేంద్రాల నిర్వహణ	: 30
శిబిరాల్లో ఆవాసం పొందినవారు	: 832 మంది
నీటి ఉధృతికి పాడైన రోడ్లు	: 16.38 కిలోమీటర్లు
రోడ్లకు పడిన గండ్లు	: 2 ప్రాంతాల్లో
కూలిన చెట్లు	: 10
దెబ్బతిన్న పంచాయతీరాజ్ రోడ్లు	: 2 కిలోమీటర్లు
33 కేవీ ఫీడర్స్ ప్రభావితమైనవి(పాడైనవి)	: 3
11 కేవీ ఫీడర్స్ ప్రభావితమైనవి	: 12
11 కేవీకి చెందిన విద్యుత్ స్తంభాలు కూలినవి	: 36
ఎల్‌టీ విద్యుత్ స్తంభాలు కూలినవి	: 53
పాడైన ట్రాన్స్‌ఫార్మర్లు	: 27